క్లుప్తంగా

గుంతలు పూడ్చండి మహాప్రభో..!



రామతీర్థం ప్రధాన రహదారి గుంతల్లో చేరిన వర్షపునీరు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని రామతీర్థంలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని స్థానికులతో పాటు ప్రయాణికులు కోరుతున్నారు. నెల్లిమర్ల – రణస్థలం ప్రధాన రహదారి కావడంతో నిత్యం వేలాదిమంది ఆ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. పెద్ద పెద్ద గుంతులేర్పడడంతో వర్షం నీరు అందులో చేరి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కాలువలు లేకపోవడంతో గ్రామంలోని మురుగు నీరంతా వచ్చి గుంతల్లో చేరుతోందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భోగాపురం: మండలంలోని ముక్కాం, భోగాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో 33 కేవీ లైన్లకు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయనగరం రూరల్ విద్యుత్‌శాఖ ఈఈ జి. సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నిరసన



రామతీర్థం జంక్షన్ వద్ద నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

నెల్లిమర్ల: రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ సభ్యులు సోమవారం స్థానిక రామతీర్థం జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కె. జగదీష్ మాట్లాడుతూ.. 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో మహిళలకు కనీసం రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మహిళలపై దాడులు మరింత పెరిగాయని, ఇది ఆందోళనకరమైన విషమన్నారు. కార్యక్రమంలో వంశీ, దుర్గాప్రసాద్, మురళి, తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా ఫ్లాగ్ అడాప్టింగ్ డే



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న చిన్నారులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని గురజాడ పబ్లిక్ స్కూల్‌లో ఫ్లాగ్ అడాప్టింగ్ దినోత్సవాన్ని విద్యార్థులు సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ పతాకానికి విద్యార్థులు సెల్యూట్ చేశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎం. స్వరూప , ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఈపీ రద్దు చేయాలి




కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్న యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న న్యూ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ)–2020ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఎన్ఈపీ అమలులో భాగంగా తాజాగా 'శిక్షా సప్తాహ్' పేరుతో పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు చేయమని ప్రకటించారని.. ఈ కార్యక్రమాల వల్ల బోధనా సమయం హరించిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తీసుకొచ్చిన మెమో 172, జీఓ 117 మూలంగా వేలాది పాఠశాలల్లో లక్షలాది మంది విద్యార్థులు తగ్గిపోయారని ఆరోపించారు. ఈ పరిస్థితికి మూలకారణమైన ఎన్ఈపీ–2020ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఆర్‌సీ పట్నాయక్, జేఏవీఆర్‌కే ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఎస్.సత్యనారాయణ, కె.ప్రసాదరావు, జీవీ రమణ, సీహెచ్.తిరుపతినాయుడు, జి.రాజారావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.శంకరరావు, సీపీఎస్ సబ్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్, వివిధ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రామతీర్థసాగర్.. సాకారమయ్యేనా..!





ఆనందపురం వద్ద బ్యారేజీ

నీలంరాజుపేట వద్ద రామతీర్థసాగర్ రిజర్వాయర్ గట్టు నిర్మాణం

కుమిలి వద్ద రిజర్వాయర్ గట్టు

- ప్రాజెక్ట్ పూర్తయితే 24,710 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు
- విజయనగరం పట్టణానికి తాగునీరు
- ఎన్నికల ముందే పెండింగ్ బిల్లులు రూ. 20 కోట్లు విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ సర్కారు
- ఎన్టీఆర్ పేరు పెట్టినా ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేసిన చంద్రబాబు

పూసపాటిరేగ : మండలంలోని కుమిలి గ్రామంలో గల రామతీర్థసాగర్ రిజర్వాయర్ పనులు నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. వైఎస్సార్‌సీపీ సర్కారులో జరిగిన పనులు తప్ప నూతన ప్రభుత్వంలో ఎటువంటి పనులు చేపట్టలేదు. రిజర్వాయర్ పూర్తయితే 24,710 ఎకరాలకు సాగునీరు అందుతుంది. అలాగే పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాలకు సాగునీరు.. విజయనగరం పట్టణానికి తాగునీరు అందించవచ్చు. గుర్ల మండలంలోని కోటగండ్రేడు వద్ద చంపావతినదిలో బ్యారేజీ నిర్మించి కాలువ ద్వారా రోజుకు 1200 క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి మళ్లించి, 2,728 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా నిర్మాణాలు జరుగుతున్నాయి. రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా 9,924 ఎకరాలకు.. ఎడమ కాలువ ద్వారా 14,786 ఎకరాలకు నీరు అందించేలా అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2007లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రూ.179 కోట్ల అంచనా వ్యయంతో పూసపాటిరేగ మండలం కుమిలి వద్ద ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేశారు. ఇందులో చాలావరకు పనులు అప్పట్లోనే పూర్తయ్యాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో 60.07 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు జరిగాయి. మిగిలిన 16.17 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తి చేయాల్సి ఉంది. తాజాగా కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తున్నా రిజర్వాయలో ఎటువంటి పనులు జరగడం లేదు. రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలు 25.22 కిలోమీటర్లు కాగా 10 కిలోమీటర్ల పనులు మాత్రమే ఇప్పటివరకు పూర్తయ్యాయి. మిగిలిన 15.05 కిలోమీటర్ల కాలువ నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. రిజర్వాయర్‌లో డెడ్‌స్టోరేజీ 0.48 టీఎంసీల నీటితో విజయనగరం పట్టణానికి శాశ్వతంగా తాగునీరు సమస్య పరిష్కరించడానికి గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ప్రస్తుతం పనులు సాగకపోవడంతో అటు రైతులకు సాగునీరు, ఇటు ప్రజలకు తాగునీరు అందుతుందా.. అనే ప్రశ్న తలెత్తుతోంది.

ఎన్టీఆర్ పేరు పెట్టినా కానరాని శ్రద్ధ

ప్రాజెక్ట్‌కు ఎన్టీఆర్ పేరు పెట్టినా నిర్మాణంపై టీడీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రాజెక్ట్ నిర్మాణంపై పూర్తిగా నిర్లక్ష్యం వహించారు. 2015లో ప్రాజెక్ట్ ఖరీదును రూ. 470 కోట్లకు పెంచినప్పటికీ నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండేవి. 2019లో టీడీపీ ప్రభుత్వం పాలన పూర్తయ్యే సరికి కేవలం 18 శాతం పనులు మాత్రమే జరిగాయి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020లో ప్రాజెక్ట్ ఖరీదును అమాంతంగా రూ. 739.9 కోట్లకు పెంచారు. పనులు చకచకా సాగడంతో ఇప్పటివరకు రూ. 381 కోట్లను ఖర్చు చేసి 52 శాతం పనులు చేపట్టారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. పనులు చేపట్టకపోవడంతో నెల్లిమర్ల నియోజకవర్గానికి సాగునీరు, విజయనగరం పట్టణానికి తాగునీరు, భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నీరు అందుతుందా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పనులపై చర్చించాలి..



రామతీర్థసాగర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేసేలా ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అసెంబ్లీలో చర్చించాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు 55 శాతం పనులు పూర్తయ్యాయి. తాజాగా వచ్చిన ప్రభుత్వం రామతీర్థసాగర్ ఊసెత్తడం లేదు. నెల్లిమర్ల నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందించే దిశగా నూతన ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఈ విషయంలో ఎమ్మెల్యే స్పందించాలి.

మహంతి శ్రీనివాసరావు, రెల్లివలస, పూసపాటిరేగ మండలం

ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదు..



రామతీర్థసాగర్ ప్రాజెక్ట్‌లో భాగంగా ముంపు గ్రామాలకు ఇవ్వాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇంతవరకు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్‌పై ఎటువంటి ప్రకటన చేయలేదు. ప్రజాప్రతినిధులు ఈ విషయమై అసెంబ్లీలో ప్రస్తావించి, నియోజకవర్గ ప్రజలకు న్యాయం చేయాలి.

– లెంక శివ, రైతు, ఆత్మరాముని అగ్రహారం, నెల్లిమర్ల మండలం

సమస్యలు ప్రస్తావించేనా....!

- ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలు
- తమ ప్రాంత సమస్యలపై చర్చించి, పరిష్కరిస్తారని ఎదురుచూస్తున్న ప్రజలు

విజయనగరం:

ప్రజా సమస్యల పరిష్కారానికి కీలకమైన వేదిక ఏపీ శాసనసభ. ప్రస్తుతం శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాల్లో నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతో పాటు ప్రజా సమస్యలపై గళం విప్పినప్పుడే అవి పరిష్కారానికి నోచుకుంటాయి. సోమవారం నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో విజయనగరం నియోజకవర్గం నుంచి మొదటిసారిగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న పూసపాటి అధితి గజపతిరాజు ఏ మేరకు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా తన గళం విప్పుతారోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. విజయనగరం నియోజకవర్గ పరిధిలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు విజయనగరం మండలం ఉన్నాయి. ప్రధానంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అయితే మిగిలిన సమస్యల పరిష్కారానికి నూతన ఎమ్మెల్యే చొరవ చూపాలన్నది ప్రజల ఆకాంక్ష. ప్రధానంగా విజయనగరం నడిబొడ్డున గల పెద్ద చెరువులో నిలిచిపోయిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణ పనులు పునఃప్రారంభించి పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయించాలి. అలాగే తాగునీటి సరఫరాలో భాగంగా తరుచూ తలెత్తున్న సాంకేతిక సమస్యల పరిష్కారంపై ప్రస్తావించాల్సిన అవసరం ఉంది. వేసవిలో తాగునీటి ఎద్దడికి తావు లేకుండా శాశ్వత పరిష్కార చర్యలపై చొరవ చూపాలి. అంతేకాకుండా ప్రతిరోజూ నీటి సరఫరా చేయడంలో కీలకమైన తారకరామతీర్థ సాగర్ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. మధ్యలో నిలిచిపోయిన అంబటిసత్రం జంక్షన్ నుంచి కొత్తపేట నీళ్ల ట్యాంక్ రహదారి విస్తరణ పనులు పూర్తి చేయాలి. గత ప్రభుత్వ హయాంలో మహిళా పార్కు, చిల్డ్రన్ పార్కుల నిర్మాణం చేపట్టగా.. మిగిలిన పార్కుల అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేలా కృషి చేయాలి. ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కల్పనపై అసెంబ్లీలో చర్చించి వాటిని అమలు జరిగేలా చూడాలి. ఉద్యోగాలు లేని వారికి నిరుద్యోగ భృతి అందించడంలో భాగంగా అర్హులను గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలి.



విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియల్ వ్యూ

ఉపాధి కల్పించాలి..

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుపై ఎమ్మెల్యేలు శాసనసభలో ప్రస్తావించాలి. ముఖ్యంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడానికి చర్యలు తీసుకోవాలి. ఈ అంశంపై ఎమ్మెల్యేఅధితి గజపతిరాజు అసెంబ్లీలో ప్రస్తావించాలి. నగరంలో తాగునీటి సరఫరాలో అవాంతరాల్లేకుండా చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో చర్చించాలి.

– కె. రాంబాబు, నిరుద్యోగి, విజయనగరం

మా ప్రాంతంలో క్వారీ వద్దు..

- ఆర్డీఓను కోరిన రామచంద్రపేట వాసులు



క్వారీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ



రామచంద్రపేట గ్రామస్తులతో సమావేశమైన అధికారులు

భోగాపురం: గ్రామ సమీపంలో క్వారీ ఏర్పాటు చేయవద్దని మండలంలోని రామచంద్రపేట గ్రామస్తులు ఆర్డీఓ సూర్యకళకు విన్నవించారు. నిర్మాణంలో ఉన్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అవసరమైన మెటల్, పిక్కకు సంబంధించి కొంగవానిపాలెం రెవెన్యూ పరిధిలో సుమారు మూడెకరాల కొండపై క్వారీ నిర్వహణకు జీఎంఆర్ ఎయిర్ పోర్టు లిమిటెడ్, ఎల్అండ్‌టీ సంస్థలు సంయుక్తంగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవడంతో ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. దీంతో గ్రామస్తులు మా ప్రాంతంలో క్వారీ ఏర్పాటు చేయొద్దంటూ మైనింగ్ శాఖ అధికారులు, ఆర్డీఓను కలిసి వినతిపత్రాలు అందజేశారు. దీంతో ఆర్డీఓ సూర్యకళ స్పందిస్తూ జీఎంఆర్, ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులతో కలిసి క్వారీకి కేటాయించిన స్థలాన్ని సోమవారం పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి క్వారీ ఏర్పాటు వల్ల వచ్చే సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు స్పందిస్తూ ఇప్పటికే తమ గ్రామానికి పక్కనే పలు క్వారీలు ఉన్నాయని, వాటి వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ముఖ్యంగా రాళ్లను తీసే క్రమంలో బాంబ్ బ్లాస్టింగ్ చేయడం వల్ల శ్లాబుల పెచ్చులూడుతున్నాయని ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే క్వారీ నుంచి వచ్చే దుమ్ము, ధూళి వల్ల తాగునీరు కలుషితమై రోగాలు బారిన పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధి సురేష్ స్పందిస్తూ.. మా సంస్థ ముందు సేఫ్టీకి ప్రాధాన్యం ఇస్తుందని, ఎవరికి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా గ్రామంలోకి దుమ్ము, ధూళి వెళ్లకుండా క్వారీకి నలువైపుల 50 మీటర్ల ఎత్తు వరకు రేకులు వేస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామానికి నిత్యం తాగునీరు అందిస్తామన్నారు. దీనిపై గ్రామస్తులు స్పందిస్తూ గతంలో కుడా ఇలానే చాలా హామీలు ఇచ్చారని, ఆ హామీలు తమకు అవసరం లేదని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే, స్థానిక నాయకుల సహాయంతో గ్రామంలో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటామని చెప్పారు. క్వారీ నిర్వహణకు అనుమతిస్తే మా గ్రామాన్ని వేరే చోటుకి తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ సంస్థ ప్రతినిధి రామరాజు, మైనింగ్‌శాఖ ఎ.డి సూర్యచంద్రరావు, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ప్రజాప్రతినిధులు దుక్క అప్పన్న, శ్రీను, కోల రామసూరి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం : మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదికకు 14 వినతులు వచ్చాయి. పలువురు తమ సమస్యలను వెల్లడిస్తూ వినతిపత్రాలను కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు అందజేశారు. ఆయా వినతులను పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబందించి 5, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 4, శానిటేషన్‌కు సంబంధించి 2, రెవెన్యూకు సంబంధించి 1, మెప్మాకు సంబంధించి ఒకటి, సచివాలయంనకు సంబంధించి ఒక వినతి అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీలు మధుసూదనరావు, అమ్మాజీరావు, ఈఈ కె. శ్రీనివాసరావు, మేనేజర్ ప్రసాదరావు, టీపీఆర్ ఓ. సింహాచలం, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

'శిక్షా సప్తాహ్' ఎంతో ఉపయోగకరం

- డిప్యూటీ డీఈఓ వెంకటరమణ



ప్రదర్శనను తిలకిస్తున్న డిప్యూటీ డీఈఓ వెంకటరమణ, తదితరులు



విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందిస్తున్న అధికారులు

డెంకాడ : ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో దాగి ఉన్న విభిన్న అంశాలను వెలికితీసేందుకు శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని డిప్యూటీ డీఈఓ కె.వెంకటరమణ అన్నారు. మండలంలోని ఆర్.ముంగినాపల్లి ప్రాథమికోన్నత, పెదతాడివాడ జిల్లా పరిషత్ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పలు రకాల ప్రదర్శనలను ఎంఈఓ శ్రీరామ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, హెచ్‌ఎం జీవీఎస్ నగేష్, పెదతాడివాడ హెచ్‌ఎం వీవీఏ నరసింగరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వితరణ..

ఉపాధ్యాయురాలు జి.సరిత, మరికొంత మంది దాతలు ఆర్.ముంగినాపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లు, ఐడీ కార్డులను వితరణగా అందజేశారు. వీటిని డిప్యూటీ డీఈఓ కె.వెంకటరమణ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

టీఎల్ఎంతో మెరుగైన బోధన

భోగాపురం: టీఎల్ఎంతో (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్) విద్యార్థులకు మెరుగైన బోధన అందించవచ్చునని ముక్కాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. నర్సింగరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ జాతీయ విద్యా విధానం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు శిక్ష సప్తాహ (విద్యా వారము) అనే కార్యక్రమం వారం రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న సంగతి విధితమే. ఇందులో భాగంగా ముక్కాం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు పలు ప్రాజెక్ట్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎస్. భవానీ, ఎస్. నళిని, లక్ష్మణరావు, అనసూర్య, మల్లికార్జునరావు, గణపతి, కృష్ణ, లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

- ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు



రక్తదాతలను అభినందిస్తున్న డాక్టర్ జయచంద్రనాయుడు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యంగా ఉన్న యువత రక్తదానానికి ముందుకు రావాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం. జయచంద్రనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గాయత్రి ఆస్పత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ, శ్రీశ్రీ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుత.. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానంపై అపోహలు విడనాడాలని సూచించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని చెప్పారు. కార్యక్రమంలో గాయత్రి ఆస్పత్రి ఎం.డి వెంకట్, శ్రీశ్రీ కోచింగ్ సెంటర్ అధినేత పాట్నా శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి రాము, తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రగతి దేశ అభివృద్ధికి కొలమానం



విద్యా సామగ్రి అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ, తదితరులు

విజయనగరం: విద్యా ప్రగతి దేశ అభివృద్ధికి కొలమానమని గంట్యాడ మండల విద్యాశాఖాధికారి విజయకుమారి అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ఉడా కాలనీ ఈవినింగ్ వాకర్స్ క్లబ్‌లో ప్రతినిధులు సమకూర్చిన నోట్ పుస్తకాలు, స్టీలు కంచాలు, గ్లాసులు, విద్యాసామగ్రిని గంట్యాడ మండలం జగ్గాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్వచ్ఛంద సంస్థలు విద్యా ప్రగతికి చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు సత్ఫలితాలను అందిస్తాయన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈవినింగ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జామి అప్పలసూరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు కొత్తలి ఎర్రినాయుడు, ఈవినింగ్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి టి.చిన్నారావు, డిప్యూటీ గవర్నర్ టి.చిరంజీవిరావు, ఎం.జనార్దనరావు, జగ్గాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయులు బి. లక్ష్మి, ఇ. గురునాథ్, సర్పంచ్ కొండపల్లి రాంబాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.